## క్లుప్తంగా

### సన్మానం



సుభాష్ రాథోడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

**జహీరాబాద్‌టౌన్:** జహీరాబాద్‌కు బదిలీపై వచ్చిన ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుభాష్ రాథోడ్‌ను తెలంగాణ బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం(టీబెస్) నాయకులు సోమవారం సన్మానించారు. మండలంలోని సేడియా గుట్ట తండాకు చెందిన సుభాష్ రాథోడ్ సూర్యాపేట కోర్టు నుంచి జహీరాబాద్ కోర్టుకు పీపీగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు టీబెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చవాణ్, జహీరాబాద్ అధ్యక్షుడు తుకారాం చౌవాన్, నాయకులు హీరాలాల్, జౌసింగ్ చౌవాణ్, పెంటనాయక్, దల్‌సింగ్, ఉపాధ్యాయులు బాలయ్య, ఆనంత్, శ్రీశైలం తదితరులు ఆయనను సన్మానించారు.

### వైద్య శిబిరానికి స్పందన

**సదాశివపేట(సంగారెడ్డి):** వైద్య ఖర్చులు ఊహించనంతగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఉచిత వైద్య సేవలు అందించడం అందరి సామాజిక బాధ్యతని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎండి షఫీ పేర్కొన్నారు. హజ్రత్ మహబూబ్‌భాషా వర్ధంతి సందర్భంగా సంజీవి ఇన్సాఫ్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌భాషా దర్గా ఆవరణలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో దర్గా ఆవరణలో భక్తులకు మోకాళ్లు, మోచేతులు, కీళ్లకు సంబంధించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆయుర్వేద వైద్య శిబిరం కొనసాగించాలని ఇన్సాఫ్ ఆలోచన చేస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో దర్గా అధ్యక్షుడు ఎండీ, రఫీ, సీపీఐ నాయకులు ఎం.తాజోద్దీన్, సుభాన్, గోపాల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

### రేషన్‌కార్డు నుంచి పేరు తొలగింపు

**చర్యలు తీసుకోవాలని బాధితురాలి వినతి**



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సుశీల

**నారాయణఖేడ్:** తాను బతికి ఉండగానే తన పేరును రేషన్ కార్డులో నుంచి తొలగించారని నిజాంపేట మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన కమ్మరి సుశీల సోమవారం జిల్లా కలెక్టర్‌కు, నిజాంపేట తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొంది. తాను కొన్ని సంవత్సరాలుగా రేషన్ కార్డు నంబర్ 369340191435తో బియ్యం తీసుకుంటున్నానని తెలిపారు. ప్రతి నెల మాదిరిగానే ప్రస్తుతం తాను బియ్యం కోసం రేషన్ దుకాణానికి వెళ్లడంతో డీలర్ తన పేరు జాబితాలో కనిపించడం లేదని తెలిపాడన్నారు. ఈ విషయమై డీలర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పడం లేదని, తనకు తిరిగి రేషన్ కార్డును ఇప్పించి తనకు బియ్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**జహీరాబాద్‌టౌన్:** సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జహీరాబాద్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రెండు గంటలు కరెంట్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు డివిజన్ పరిధిలో, చిన్న హైదరాబాద్, మల్చల్మ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**సదాశివపేట డివిజన్‌లో..**

**సదాశివపేట(సంగారెడ్డి):** సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణ పరిధితోపాటు మండలంలోని పెద్దాపూర్, నందికంది, గొల్లగూడెం, కంబాలపల్లి, రేజింతల్, యావాపూర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సంతోష్ తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించగలరని ఆయన కోరారు.

### అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

**నారాయణఖేడ్:** అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నారాయణఖేడ్ డివిజన్ నాయకులు చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవికాలంలో టీచర్, ఆయాలకు ఒకేసారి సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల కేంద్రాలను ఉదయం 8గంటల నుంచి 12.30గంటల వరకే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# సొంత భవనం నిర్మించేనా?

- కమ్యూనిటీ భవనంలోనే మున్సిపాలిటీ కొనసాగింపు
- ఆదాయం ఉన్నా కొత్త భవన నిర్మాణంలో జాప్యం
- ఇబ్బందుల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ఏడాదికి సుమారు రూ.12కోట్ల ఆదాయం.. అయినా.. బొల్లారం మున్సిపాలిటీ కార్యాలయానికి సొంత భవనం కరువైంది. దీంతో పలుమార్లు కొత్త భవనం నిర్మించాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసినా ఫలితం లేకుండాపోయింది. భవనంలో సిబ్బందికి సరిపడా స్థలం లేకపోవడంతో విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న బొల్లారం మున్సిపల్ కార్యాలయం

జిన్నారం మండల పరిధిలోని బొల్లారం మున్సిపాలిటీగా ఆవిర్భవించి నాలుగేళ్లు గడుస్తోంది. అప్పట్లో గ్రామపంచాయతీ భవనంలోనే మున్సిపల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కేబీఆర్ కాలనీలోని కమ్యూనిటీ భవనంలోకి తరలించారు. పాత భవన్నాన్ని కూల్చివేసి అక్కడే నూతన భవనాన్ని నిర్మించాలని, నూతన భవన నిర్మాణం కోసం రూ.4కోట్ల నిధులు ఖర్చు అవుతాయని అధికారులు, ప్రజాప్రతనిధులు అంచనా వేశారు. ఇందుకోసం కౌన్సిల్ సమావేశంలో తీర్మానం కూడా చేశారు. కానీ.. ఏడాది గడుస్తున్నా కొత్త భవన నిర్మాణం ఊసే లేదు.

**గదులు తక్కువ.. సిబ్బంది ఎక్కువ**

మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులతో పాటు పారిశుధ్య సిబ్బంది కలిపి 90మంది వరకు ఉంటారు. అధికారులు, సిబ్బందికి సరపడా గదులు కూడా లేవు. మున్సిపల్ పరిధిలో 22 వార్డులు ఉండగా, 22మంది కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులతో పాటు 10 మంది వరకు వివిధ శాఖల అధికారులు కూర్చునేందుకు సరిపడా సమావేశ మందిరం కూడా లేదు. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు.

**నిధులు లేవని దాటవేత**

రూ.4కోట్లతో మున్సిపల్ నూతన భవనాన్ని నిర్మించేందుకు సరిపడా నిధులు లేవని, కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత నిధులు రాలేవని ఉన్నతాధికారులు దాటవేస్తున్నారు. కాగా బొల్లారం మున్సిపల్ పరిధిలో 150వరకు వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను చేపడుతుంటాయి. సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ భవనాన్ని నిర్మించేందుకు యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా వెంటనే స్పందించి నూతనంగా మున్సిపాలిటీ కార్యాలయం నిర్మించాలని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

**ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం**

అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్లే నిధులు ఆగిపోయాయి. నూతన భవనాన్ని నిర్మించే విషయమై అధికారులకు చాలాసార్లు సూచించాం. సీఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి నిధులు సేకరించాలి. పాత భవనాన్ని కూల్చేసి కొత్త భవనం నిర్మించే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– చంద్రారెడ్డి, కౌన్సిలర్, బొల్లారం

**ఉన్నతాధికారులకు నివేదించాం**

మున్సిపల్ కార్యాలయ భవనం విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉన్న భవనంలో తగిన వసతులను కల్పించేలా ఏర్పాట్లు చేశాం. నివేదికలు రాగానే నూతనంగా భవనం నిర్మించేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– మంగతాయారు, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

# కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్‌ను మద్దతు కోరుతున్న నీలం మధు

**ఎంపీ అభ్యర్థి నీలం మధు**

**పటాన్‌చెరు:** మెదక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ సోమవారం నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుల ఇళ్లకు వెళ్లారు. ముందుగా పటాన్‌చెరు మండలం పాశమైలారం మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్‌ను కలిశారు. శాలువాతో సత్కరించారు. అనంతరం ఇస్నాపూర్ ఎంపీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ బూరిగారి అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శోభకృష్ణ రెడ్డిలను కలిశారు. రుద్రారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కురుమ వెంకన్న ఇంటికి చేరుకొని ఆయనను కలిశారు.

**మార్వాడి కమిటీ సభ్యులతో సమావేశం**

ఇస్నాపూర్‌లో మార్వాడి కమిటీ నాయకులతో నీలం మధు బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇస్నాపూర్ మార్వాడీల కమ్యూనిటీకి సంబంధించిన సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారినికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం మార్వాడి సాంప్రదాయం ప్రకారం నీలం మధుకు తలపాగాను బహూకరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ నాయకులు రామలాల్, మల్‌రామ్, బల్‌రాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిపై దాడి..

**తీవ్రంగా గాయాలవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు**



గాయపడ్డ విద్యార్థి విశాల్

**పటాన్‌చెరు టౌన్:** ఓ విద్యార్థి పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుంటే మరో విద్యార్థి ఆపి రాయితో దాడి చేసిన సంఘటన పటాన్‌చెరు పట్టణంలో చోటు చేసుకుంది. విద్యార్థి, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ వాసర్‌కిషన్‌తండాకు చెందిన దేవిసింగ్ తన కుటుంబంతో పటాన్‌చెరు గౌతంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అయితే అతని కుమారుడు విశాల్ పటాన్‌చెరు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలలో ఉండగా ఆదికేశవుల అనే 8వ తరగతి మరో విద్యార్థి పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుంటే విశాల్ అతని బ్యాగ్ పట్టుకొని ఆపాడు. దీంతో ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవైంది. ఆదికేశవులు తొలుత విశాల్‌ను కర్రతో, అనంతరం రాయితో తలపై గట్టిగా కొట్టాడు. దీంతో అతని తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో అతని తలకు ఐదు కుట్లు వేశారు. పాఠశాల ఉపాధ్యాయులు ముందుగా జరిగిన ఘటనపై సమాచారం ఇవ్వకుండా తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం తెలియజేశారని విద్యార్థి తల్లి వాపోయింది. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని విద్యార్థి తల్లి దండ్రులు విలేకరులతో వివరించారు. ఈ ఘటనపై డీఈఓ వెంకటేశ్వర్లను వివరణ కోరగా ఎంఈఓ పీపీ రాథోడ్ ద్వారా నివేదిక తెప్పించుకొని, దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సమష్టి కృషితో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ నరేశ్‌పాటిల్

**జహీరాబాద్‌టౌన్:** సమష్టి కృషితో జహీరాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయమని పలువురు నాయకులు అన్నారు. పట్టణానికి చెందిన అల్లాడి బక్కయ్యగుప్తాకు జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్‌గుప్తాకు జిల్లా కోశాధికారిగా పోస్టులు దక్కిన సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్‌స్వామి అధ్యక్షతన సోమవారం అభినందన సభ నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి అరుణ కైలాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ నరేశ్‌పాటిల్‌లు మాట్లాడుతూ.. మళ్లీ దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు మోదీ చేపడుతున్న సంక్షేమాన్ని ప్రచారం చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పకుండా పదవులు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనితాపాటిల్, జహీరాబాద్‌రూరల్, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల పార్టీ అధ్యక్షులు దుర్గయ్య, వైద్యనాథ్, ఓంకార్, విశ్వనాథ్, పట్టణ కార్యదర్శి రాఘవేంద్రనాయక్, బొగ్గుల సంతోష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ భక్తిశ్రద్ధలతో నవ చండీయాగం**

**నారాయణఖేడ్:** ఖేడ్‌లోని మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ స్వగృహం ఆవరణలో 3రోజుల పాటు నిర్వహించనున్న వీరశైవ ఆగమోక్త ప్రకారం రాజశ్యామల సహిత నవచండీయాగం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహావచనం, ఆవాహిత మండపపూజ, గణపతి హోవనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను చండీఉపాసకులు అయ్యప్పస్వామి, ఆజయ్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సురేష్ షెట్కార్, ఉమాదేవి షెట్కార్ దంపతులతో పాటు కుటుంబీకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**◆ ఇంటిపన్నులు చెల్లించాలి**

**సదాశివపేట(సంగారెడ్డి):** అస్తిపన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఉమా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 30 లోపు ఆస్తిపన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు.

**◆ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పట్టణంలోని మల్లికార్జుననగర్ కాలనీలోని అభయాంజనేయస్వామి దేవాలయ 9వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం గణపతి నవగ్రహ రుద్రహోమం, శ్రీహనుమాన్ చాలిసా పారాయణం, ఆంజనేయ స్వామి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు నగేష్, ఆదర్శ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

**◆ రుణమాఫీ విడుదల చేయాలి**

**సంగారెడ్డి టౌన్:** రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తానన్న రూ.2లక్షల రుణమాఫీని వెంటనే విడుదల చేసి రైతులకు కొత్త రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వరిధాన్య కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**◆ అగ్నిప్రమాదం: రూ.60 వేల నష్టం**

**నారాయణఖేడ్:** పట్టణంలోని బసవేశ్వర చౌక్ సమీపంలోని శంకరప్ప ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా శకటంతో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పారు. ఆలోపే ఫ్రిజ్, కూలర్, దుస్తులు, ఆహార ధాన్యాలు, సామగ్రి కాలిపోయింది. రూ.60వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

**◆ మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు**

**హత్నూర(సంగారెడ్డి):** మండలంలోని రెడ్డి ఖానాపూర్ మల్లన్న జాతరలో సోమవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్రెడ్డి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, నాయకులు శ్రీకాంత్, వీరేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపులో భక్తులు

# ఘనంగా వీరభద్రుడి అశ్వవాహన సేవ

**జిన్నారం(పటాన్‌చెరు):** మండలంలోని వీరన్నగూడ గ్రామంలో గల భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనంపై వీరభద్రుడిని ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఈఓ శశిధర్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. సోమవారం స్వామివారి సన్నిధిలో కాంగ్రెస్ నేత ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకం, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు చేపట్టారు. బ్రహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ అధికారులు సూచించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని పంచలోహంతో తయారు చేసిన తొడుగుతో ముస్తాబు చేశారు.

# ఘనంగా బీరప్ప కల్యాణం

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** మండల పరిధిలోని నాగులాపల్లి గ్రామంలో సోమవారం బీరప్ప కామరాతి స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మహిళలు శివసత్తుల పూనకాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలతో బోనాల ఊరేగింపు నిర్వహించారు. బీరప్ప కల్యాణోత్సవానికి టీజీఐఐసీ చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీరప్ప జాతరను వీక్షించేందుకు స్థానికులే కాకుండా మండల పరిధిలోని గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, గ్రామ పెద్దలు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లికార్జునస్వామి జాతర



ఘట్టం ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పట్టణంలోని మందుముల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో మూడురోజుల పాటు మలన్న జాతరను ఘనంగా నిర్వహించారు. మల్లన్న జాతర, కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం ఘట్టం ఊరేగింపును పోతురాజుల విన్యాసాల మధ్యన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, నాయకులు పాల్గొన్నారు.

### ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండల పరిధిలోని గంజోటి గ్రామంలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు మానసాదేవి నాగదేవతా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 2వ తేదీన యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, శ్రీగౌరీ గణపతి గోపూజా అంకురార్పణం 3న గోపూజ, మండప ఆరాధన, ప్రత్యేక పూజలు, 4వ తేదీన స్వామీజీలతో విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఉద్యోగికి పదవీ విరమణ సహజం



రుద్రప్పను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సదాశివపేటరూరల్(సంగారెడ్డి):** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, సమగ్ర శిక్షా అభియాన్ స్టేట్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గజ్జెల రమేశ్ అన్నారు. మండల పరిధిలోని నిజాంపూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, మండల నోడల్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన పటోళ్ల రుద్రప్ప సన్మాన సభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని తెలిపారు. విద్యారంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. రుద్రప్ప క్రమశిక్షణ నిబద్ధతకు మారుపేరు అని విద్యార్థుల హృదయాల్లో చెరగని ముద్రవేశారన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విశ్వఫౌండేషన్, అక్కల్‌కోట శివపురి వారు తల్లిదండ్రులు లేని 5 మంది విద్యార్థులకు రూ.5వేల ఆర్థిక సహాయం, విద్యా సామగ్రి, స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అంజయ్య, సీఎంఓ వెంకటేశం, ఏఎంవో అనురాధ, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌గోపాల్, లక్ష్మణ్, పోట్రు రామకృష్ణ, ఎంపీటీసీ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.




ఉపాధ్యాయులతో విద్యార్థులు

### ఘనంగా స్వయంపాలన

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండల పరిధిలోని హద్నూర్ నవ భారత్ పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు సురేశ్, శివకుమార్, ప్రణీత్ పాల్, స్నేహలత, శివానీ, రూత తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.